# ★ శివుని ఆజ్ఞ ★

పార్వతి తపస్సు చేసి శివుణ్ణి మెప్పించి ఆయనను పెండ్లి చేసుకుంది.

పార్వతీదేవితో బాటు ఆమె వాహనమైన సింహంకూడా శివుని నివాసమైన కైలాసగిరికి వెళ్ళింది.

కైలాసంలో ఉన్న అరణ్యంలో ఒక ఏనుగ వుంది ఆ ఏనుగను చూడటంతోనే సింహానికి నోరూరింది.

తన కుంభస్థలం మీదికి ఉరకబోతున్న సింహంతో యేనుగ, 'ఆగు!' అంది.

సింహం, 'నన్నా ఆగమంటున్నావు? నే నెవర ననుకున్నావు? పార్వతీదేవి యొక్క వాహనాన్ని!' అంటూ గర్జన చేసింది

'కావచ్చు. కాని యీ అడవిలో శివుని ఆజ్ఞ లేనిదే చీమకైనా హాని జరగటానికి వీల్లేదు. వెళ్ళు!' అంది ఏనుగ.

సింహానికి కోపంవచ్చింది. కోపమంతా దిగమింగుకుని, ఒక్క మందహాసం చేసి, 'శివుని ఆజ్ఞంటే ఎంతసేపు? ఇట్టే తెస్తాను వెళ్ళి! ఆయన ఆలివంక చుట్టాన్నైన నన్ను కాదంటాడా?' అని, పార్వతీదేవి అంతఃపురంవైపు పరుగెత్తింది.

సింహం ఆ దేవేరి చేత శిఫారసు చేయించుకుని శివునియొక్క అనుమతిని ఇట్టే సంపాదిస్తుందనీ, అప్పుడు తనకు ముప్పురాక తప్పదనీ అధైర్యపడింది యేనుగ

ఏం చెయ్యాలో తోచక, ఆ ఏనుగ మెల్లిగా అడుగులు వేసుకుంటూ తన మిత్రుడు గుడ్లగూబ నివసిస్తోన్న రావి చెట్టు వద్దకు వెళ్ళింది.

'ఏం మిత్రమా విచారంగా వున్నావు?' అని అడిగింది ఘూకం.

ఏనుగ సంగతంతా చెప్పి, "ఆ సింహం ఈరాత్రో రేపో మళ్ళీ వచ్చి, 'శివుని ఆజ్ఞ అయిందం'టూ నాపని పట్టేస్తుంది" అంది

గూబ, 'ఏడిసిందిలే! నువ్వేం భయపడకు. నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డువేస్తాను' అంది.

గూబ పలుకులు వినేసరికి అంత విచారంలో కూడా ఏనుగకు నవ్వు వచ్చింది.

గూబ, "నవ్వకు మిత్రమా. 'కొంత ఉన్నావు! నువ్వు చేయ కలిగిం దేమిటి?' అని తోసి పారెయ్యకు. ఈ ఆపదలోంచి నిన్ను తప్పించి తీర్తాను. ఆనాడు నువ్వు నాకు చేసిన ఉపకారానికి ప్రత్యుపకారం చేసి నా కృతజ్ఞత నీకు కనపరుచుకుంటాను" అంది.

ఏనుగ, 'నీకు నా వల్ల జరిగిన ఉపకారమేమిటి?' అంది

గూబ, 'మరిచిపోయావా? ఆశ్చర్య మేముందిలే. మంచివాళ్లు తాము ఇతరులకు చేసిన మేలు ఇట్టే మరిచిపోతారు...ఆనాడు గాలివాన వచ్చినరోజున ఈ చెట్టు కూలిపోయి నేలమీదికి ఒరిగిపోయింది జ్ఞాపకం లేదూ? అప్పుడు నాభార్య తొఱ్ఱలో గుడ్లుపెట్టి పొదుగుతున్న సమయం. 'ఎలాగరా భగవంతుడా!' అని ఆందోళన పడుతున్న సమయంలో భగవంతుడులాగే నువ్వు ఈ దారిన వచ్చావు. నా గోడు విని, నీ తొండముతో ఈ చెట్టును యథాప్రకారం నిలబెట్టి, నీ కాళ్ళతో చెట్టు మొదలు కట్టుదిట్టం చేసి నా కొంప నిలబెట్టేవు' అంది.

**పాలంకి వెంకటరామచంద్రమూర్తి**

---

## గురు భక్తి

తగిన ఉపచారాలు చేశాడు. ఆరుణికి తెలివివచ్చింది విద్యార్థులందరూ కలిసి రంధ్రాన్ని పూడ్చారు.

ఆరుణి చూపిన ధైర్యానికి, గురుభక్తికీ, ఓర్పుకూ గురువు మెచ్చుకొన్నాడు "నీకు సకల శుభాలు కలుగుగాక!" అని ఆశీర్వదించాడు.

★

ఏనుగ, 'ఆ మాత్రానికేనా ఇంతగా చెపుతున్నావు? అది నా చేతిలోవున్న పనిగాబట్టి చేశాను' అంది.

గూబ, 'ఆసింహం మళ్ళీ వస్తే నువ్వేమీ అధైర్యపడకు. ఎందుకైనా మంచిది. నువ్వు అది వచ్చేవరకూ ఈ చుట్టుపక్కలే వుంటే ఏం జరుగుతున్నదీ నాక్కూడా తెలుస్తుంది' అంది.

ఏనుగ, 'సరే' అందికాని దాని గుండెమాత్రం కుదుటపడలేదు.

అక్కడ సింహం పార్వతీదేవి ముందు నిలబడి, "చూశావుటమ్మా, ఈ అడవిలోవున్న ఏనుగకు ఎంత పొగరోనూ? దాన్ని నేను ఫలహారం చేద్దామని వేడితే, 'నన్ను భక్షించడానికి నీకు శివుని ఆజ్ఞ వుందా?' అని అడిగింది! నీ వాహనాన్నైన నాకుకూడా కావాలా శివుని ఆజ్ఞ?'" అంది.

పార్వతి, 'తప్పకుండా కావాలి. నీకే కాదు, నాకుకూడా ఏమిచేద్దామన్నా ఆయన అనుమతి కావలసిందే తెలుసా? నువ్వు నా వాహనానివిగదా అన్న గర్వంతో ఇక్కడ విచ్చలవిడిగా సంచరించి ఆయనకు కోపం రప్పించావంటే, ఆ మూడో కన్ను తెరిచి నిన్ను మసిచేసి పారేస్తాడు యేమనుకున్నావో? మన్మధుడు ఎలా భస్మమైపోయాడో ఆనాడు నువ్వు కళ్ళారా చూశావుగా?' అంది.

'ఆ మాటలు వినటంతోనే సింహం చప్పబడిపోయింది. 'కాని ఆ ఏనుగను ఎలాగైనా దక్కించుకోకపోతే యింక నాకు పరపతే ఉండదు!' అని దేవుళ్ళాడింది.

పార్వతి, 'ఏదో సమయంచూసి ఆయన అనుమతి సంపాదిద్దుగానిలే. అడిగినంతమాత్రాన్ని ఆయన సమ్మతించడు. ఉపాయంగా అడగాలి' అంది.

సింహం ఆక్షణంనుంచీ ఉపాయం కోసం వెతికింది. మరునాడు శివుడు మంచికళలో వుండగా చూసి, 'ప్రభూ, తమ అనుమతి ఐతే నేను మా అడవికి పోతాను' అంది.

శివుడు నిర్ఘాంతపోయి, 'అదేమిటి? నువ్వు వెళ్ళిపోతే మీ అమ్మగారికి వాహనమెలాగ? ఇంతకీ నీకిక్కడ వచ్చిన లోపమేమిటి?' అన్నాడు.

సింహం, "లోపమని కాదు ప్రభూ. నాకు మా అడవిలోని ఏనుగులను చంపి తినడం అలవాటు. ఇక్కడ అడవిలోని జంతువులు పరస్పరం విరోధం లేకుండా మెలుగుతున్నాయి. 'ఈ పద్ధతి మంచిదే!' అని తోచి నేనుకూడా ఏ ఏనుగ దరికీ వెళ్లటంలేదు. కాని రోజూ ఒక ఏనుగమాత్రం నాకు కలలో కనపడుతోంది. దానిని భక్షించినట్లు కూడా కలగంటున్నాను. కాని స్వప్నంలోంచి మెలకువ రావటంతోనే 'అది కలయే' అనీ, 'కడుపు ఖాళీగానే వుంద'నీ తేలిపోతోంది. నిత్యం ఆ ఏనుగ కలలో కనపడి నాకు ఆశ కలిగిస్తోండడం వల్ల, అది నిజంగా ఎదురైనప్పుడు ఆకలిచిచ్చువల్ల దాన్ని ఎక్కడ చంపేస్తానో అన్న భయంవేస్తోంది. అందుకోసం ఇక్కడనుంచి పోతానంటున్నాను" అంది.

శివుడు యాధాలాభంగా 'యీమాత్రానికేనా, మీ దేవిని వదలి వెళతానంటున్నావు? అంతగా వుండబట్టలేకపోతే ఆ కలలో కనబడే ఏనుగును భక్షించవచ్చులే' అన్నాడు.

సింహం 'చిత్తం, చిత్తం తమరు మహాప్రభువులు. మా అమ్మగారిని వదలి వెళ్ళటంఅంటే నాకూ బెంగయేనండి' అంది. తర్వాత మెల్లిగా అక్కడనుంచి జారుకుని, అడవిని ప్రవేశించి, ఉరకలు వేసుకుంటూ పోయి, ఏనుగముందు ప్రత్యక్షమైంది. శివుని ఆజ్ఞ మాట చెప్పి, 'ఇప్పుడేమంటావు?' అని గర్జిస్తో మీసం దువ్వింది.

ఏనుగ దీనంగా చెట్టుపై నున్న గుడ్లగూబవైపు చూసింది. గూబ 'మృగరాజా, శివుని అనుమతి ఐందని మాకు తెలియటానికి సాక్ష్యమేమైనా వుందా?' అని అడిగింది.

సింహం కోపంగా గుడ్లగూబవైపుచూసి, 'సాక్ష్యం కావాలా మీకు? కావలిస్తే వెళ్లి ఆ శివుణ్ణే అడుగు. ఆయన అనుమతినిచ్చినపుడు పార్వతీదేవికూడా అక్కడే వుంది. ఆవిడే చెపుతుంది కావలిస్తే' అంది.

పార్వతీదేవిమాట రావటంతోనే గుడ్లగూబకు ఒక ఉపాయం తట్టింది. వెంటనే అది సింహంతో, నేను నీ మాట నిజమో కాదో ఆ శివుణ్ణి అడిగివస్తాను. మీ రిద్దరూ కూడా అక్కడికి రండి. ఈ వ్యవహారమేదో అక్కడే తేల్చుకుందాము' అంది.

గుడ్లగూబ ఇట్టే ఎగిరివెళ్లి శివుని సన్నిధిని వ్రాలి వెంటనే కళ్లు మూసుకుంది

ప్రమథగణంమధ్య కొలువు తీర్చి

# ★ శివుని ఆజ్ఞ ★

వున్న శివుడు, గూబకేసి చూసి, 'ఎవరునువ్వు?' అని ప్రశ్నించాడు.

గుడ్లగూబ పలుకలేదు. శివుని వాహనమైన నందికేశ్వరుడు, 'యీ పక్షికి నిద్ర పట్టినట్లుంది దేవా' అన్నాడు. తన తోకతో ఆ వృషభ రాజు మెల్లిగా ఆ గూబను తట్టి 'లే, లే. దేవసన్నిధిలో ఆవులించ నైనా కూడదు. అలాంటప్పుడు ఏకంగా నిద్రపోతున్నా వేమిటి?' అని లేపేడు.

గుడ్లగూబ నిద్రలోంచి అకస్మాత్తుగా లేచినట్లు లేచి కళ్ళు నులుపుకోడం ప్రారంభించింది. శివుడు 'ఎవరు నువ్వు' అని మళ్ళీ ప్రశ్నించాడు.

గుడ్లగూబ, 'దేవా, నేను వేద వ్యాసుని శిష్యుణ్ణి' అంది.

శివుడు ఆశ్చర్యంతో, 'వేద వ్యాసుని శిష్యులలో గుడ్లగూబ ఒకటి వుందని నాకు తెలియదే!' అన్నాడు.

గూబ, 'ఆ సంగతి మా గురువు గారికే తెలియదుస్వామీ. ఆయన ఒకనాడు శిష్యసమేతంగా వచ్చి, నేను నివసించే చెట్టుక్రింద కూర్చుని శిష్యులకు తర్క శాస్త్రం బోధించాడు. తొఱ్ఱలోనుండి నేనూ కూడా విని ఆ శాస్త్రంలో పాండిత్యం సంపాదించాను' అంది. నందివైపు తిరిగి, 'వృషభరాజా, చాలా గొప్ప స్వప్నం వచ్చిందయ్యా,' అంది.

'ఏమిటా స్వప్నం?' అన్నాడు శివుడు.

గూబ, 'నేను భార్యా బిడ్డలూ ఉన్నవాణ్ణే కాని ఆ కలలో నేను బ్రహ్మచారినై ఉన్నట్లూ, మా గురువైన వ్యాసమహర్షి 'వత్సా, నీకు విద్య పూర్తి ఐంది. ఇంక నీవు పెండ్లి చేసుకుని గృహస్థాశ్రమం స్వీకరించు' అన్నట్లూ వచ్చింది. నేను 'చిత్తం స్వామీ' అని గురువులవద్ద శలవు తీసుకొని పెండ్లి కుమార్తెకై వెతుకుతోంటే ఒక దేవకాంత కనపడింది. ఆమెను నన్ను పెండ్లి చేసుకోవలసిందని కోరేను. ఆమె 'శివుని ఆజ్ఞ ఐతే గాని నేను నిన్ను వివాహం చేసుకోడానికి వీల్లేదు' అని బదులు చెప్పింది ... స్వామీ ఆమెను వివాహం చేసుకోడానికి నాకు అనుమతి ఇవ్వాలి' అంది గూబ.

శివుడు 'నువ్వామెను వివాహం చేసుకోడానికి అనుమతి ఇచ్చాను. ఎవరా దేవకాంత?' అన్నాడు.

గుడ్లగూబ నసుగుతో, 'ఆమె పార్వతీదేవిలా కనపడింది ప్రభూ' అంది.

'పార్వతీ దేవి' అనటంతోనే శివుడు నిర్ఘాంతపోయాడు. తీరా మాట ఇచ్చేశాడు గనుక కోప్పడకుండా, 'ఘూకోత్తమా, వేదవ్యాస శిష్యుడవైన నీకు తెలియనిదేముంది గనక? కలలో కనపడినంత మాత్రాన, పార్వతీదేవిని నువ్వు వివాహం చేసుకుంటానంటే ఎలా కుదురుతుంది?' అన్నాడు.

గుడ్లగూబ, స్వామీ, కలలో ఏనుగ కనబడింది కాబట్టి దాన్ని భక్షించటానికి అనుమతి ఇవ్వమని సింహం కోరింది. తాము అనుమతి ఇచ్చారుట. అలాంటప్పుడు నాకు మాత్రం...' అని ఆగింది.

శివుడు, 'తప్పే. సింహం కూడా ఆ ఏనుగను భక్షించటానికి వీల్లేదు' అన్నాడు.

అప్పుడే శివుని కొలువును ప్రవేశిస్తోన్న సింహానికీ, ఏనుగకీ ఆ మాటలు చెవుల్లో పడ్డాయి. ఆశాభంగం కలిగిన సింహం చిన్నబోయింది. ఏనుగ మహానందంతో గుడ్లగూబను తన కుంభస్థలంమీద కూర్చోబెట్టుకుని, అడవిలోకి వెళ్ళిపోయింది. ★




సోల్ ఏజెంటు. యునైటెడ్ కమర్షియల్ సర్వీస్
54 బందర్ వీధి, మద్రాసు - 1.
బ్రాంచీలు: హైదరాబాదు, విజయవాడ.



నారసింహ లేహ్యము
బంగారుతో చేరినది. మేహము రక్తశోష, నిస్సత్తువ వగైరా హరించి బలము రక్తవృద్ధి కల్గించును 20తు. డబ్బీ రూ. 3-4-0 పోస్టేజి రు 1-1-0
పి. సి. ఎ. అండ్ కో., (ఆయుర్వేద సమాజం)
పెరిదేపి (పోస్టు) — నెల్లూరు జిల్లా.